నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కార్యక్రమానికి హాజరై విన్నవించాలని సూచించారు.

పరశురామ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



రాజేంద్రనగర్: పరశురామ జయంతిని పురస్కరించుకొని శ్రీ భగవాన్ పరశురాం భక్త మండల్ ఆధ్వర్యంలో ఆదివారం రాంబాగ్‌లోని దేవాలయంలో జయంత్యోత్సవ వాల్ పోస్టర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ నెల 29వ తేదీన పరశురామ జయంతిని నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సుదర్శన ప్రసాద్ తివారీ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం పరశురామ భక్త మండల్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 29న జయంతి కార్యక్రమంతో పాటు శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు హనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ శోభయాత్ర అత్తాపూర్ పురవీధుల గుండా రాంబాగ్ దేవాలయం వరకు కొనసాగనుందన్నారు. భక్త మండల్ సభ్యులు అశోక్ శర్మ, శశికాంత్ శర్మ, శోభ పాండే, పార్వతీ శర్మ, నవనీత్ వ్యాస్, గోవింద్ ఓజా తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కార్యవర్గం



సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఇ.యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల అధికారులుగా సంఘం చైర్మన్ బి.జైహింద్‌రావు, వైస్ చైర్మన్ బి.మల్లేష్ వ్యవహరించారు. సంఘం అధ్యక్ష పదవికి పోటీకి ముగ్గురు పోటీపడగా డి.బాబు, బి.శంకర్, సి.బీరప్పలు పోటీపడ్డారు. దీంతో ముగ్గురి పేర్లను లాటరీ ద్వారా ఎన్నుకున్నామన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా చిలుకూరి బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా ఇ.వెంకటేష్, కోశాధికారిగా ఎస్.గణేష్, కార్యవర్గ సభ్యులుగా జె.లక్ష్మయ్య, బి.శంకర్, బి.ఆంజనేయులు, బి.రమేష్, బి.రాజు, బి.అజయ్, జె.సిద్దప్ప, డి.లక్ష్మణ్‌తోపాటు వివిధ కమిటీల సభ్యులను ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు కొత్త కమిటీ కొనసాగుతుందని అధ్యక్షుడు వెల్లడించారు.

రజక సంఘం అధ్యక్షుడిగా సత్తయ్య



అధ్యక్షుడు పెంద్యాల సత్తయ్యతో సంఘం సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్ రజక సంఘం అధ్యక్షుడిగా పెంద్యాల సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బుద్వేల్‌లోని రజక సంఘం భవనంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ... బుద్వేల్ రజక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా ఎంపిక చేసుకున్నందుకు కమిటీ సభ్యులతో పాటు కుల సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు పి.సురేందర్, నేతలు ఎం.కృష్ణ, డి.వెంకటేశ్, పి.నందం, ఎస్.రవి, శబద్ శ్రీనివాస్, పి.సంతోష్, పి.రాజు, పి.మహేందర్, పి.అరవింద్, జి.గోపికృష్ణ, పి.నర్సింగ్ రాజు, పి.దశరథ్, ఎల్.శ్రీధర్, పి.శ్రీనివాస్, పి.వినోద్, పి.కిరణ్, సి.యాదయ్య, ఎస్.మురళీ, పి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుడి అదృశ్యం

గౌలిపురా: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన రాజు పన్నాలాల్ టక్ (70) దంపతులు ఈ నెల 14న సుల్తాన్‌షాహీ వాల్మీకినగర్‌లో నివాసముండే మనువడు ఆకాశ్ టక్ కూతురు జన్మదిన వేడుకల కోసం వచ్చారు. కాగా ఈ నెల 19న పన్నాలాల్ టక్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన మనువడు ఆకాశ్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తాత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారుల నిర్మాణంలో... నాణ్యత దైవాధీనం!

శంషాబాద్ పరిధిలోని రోడ్ల నిర్మాణంలో అక్రమాలు?

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో గందరగోళ పరిస్థితులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



పెచ్చులూడిన మ్యాన్‌హోల్



సిద్ధాంతి ముదిరాజ్ బస్తీలో కొత్తగా వేసిన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన రహదారుల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వార్థమే పరమావధిగా కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా రోడ్లను వేసేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు తాయిలాలకు ఆశపడి ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజానీకం దుమ్మెత్తి పోస్తోంది.

- పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. వాటి నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పట్టణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.
- పట్టణంలోని సిద్ధాంతి ముదిరాజ్ బస్తీలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. రహదారి నిర్మాణంలో కనీస నిబంధనలు పాటించకుండా రోడ్డును వేశారు. సమాంతరంగా వేయాల్సిన రహదారిని ఓ వైపు పూర్తిగా లోతుగా మారుస్తుండటంతో బస్తీ ప్రజలు అదే సమయంలో నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ తీరును తప్పుబట్టారు. రోడ్డును సమాంతంగా వేయకపోవడంతో పాటు నిబంధనలకు అనుగుణంగా ఆరు ఇంచ్‌ల మేర వేయాల్సిన రోడ్డును కేవలం నాలుగు ఇంచ్‌ల మందం మాత్రమే వేశారు. దీంతో పాటు రోడ్డును ఓ వైపు గుంతగా మార్చేశాడు. ఈ విషయమై కాంట్రాక్టర్‌కు స్థానికులకు వివాదం నెలకొని స్థానికంగా పెద్ద రభసే చోటు చేసుకుంది. అయినా కాంట్రాక్టర్ 90 శాతం పనులు పూర్తి చేసి పక్కకు జరిగాడు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులను సంప్రదించారు. అయినా సరైన చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లల్లోకి వర్షపునీరు..

- రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి సిద్ధాంతి ముదిరాజ్ బస్తీలో కొత్తగా అస్తవ్యస్తంగా వేసిన రోడ్డు కారణంగా వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. దీంతోపాటు లోతట్టు ప్రాంతమంతా నీటితో నిండిపోయింది. విషయాన్ని ముందే అంచనావేసి బస్తీ ప్రజలు సూచనలు కూడా వినకుండా నిర్మించిన రహదారితో స్థానికంగా తీవ్ర ఇబ్బందులే తలెత్తుతున్నాయి.
- ఇటీవల 17వ వార్డులో మరో సీసీ రహదారిలో కూడా మ్యాన్‌హోళ్ల లోపలి భాగంలో పనులు పూర్తి చేయకుండానే వదిలివేశారు. దీంతో మ్యాన్‌హోళ్లు ధ్వంసమై అస్తవ్యస్తంగా మారాయి. కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్న మున్సిపల్ అధికారులు వాటి నాణ్యత విషయంలో కనీస పర్యవేక్షణ చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వమే...



ముదిరాజ్ బస్తీలో సీసీ రహదారుల పనుల్లో నాణ్యతను అధికారులు పరిశీలించకపోవడంతో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా పనులు చేశాడు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పక్కనే ఉన్న వాళ్ల ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నారు. పట్టణంలో అనేక చోట్ల పనుల తీరు ఇలాగే ఉంది. పనులు సరిగా చేయని వారని బ్లాక్ లిస్టులో పెట్టాల్సిందే. మిగతా పనులు నాణ్యతతో పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు ఇవ్వాలి.

– మేకల వెంకటేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్

బాగుచేయిస్తాం

సిద్ధాంతి ముదిరాజ్ బస్తీలో ఇటీవల వేసిన రోడ్డులో ఓ వైపు లోతట్టుగా మారినట్లు మా దృష్టికి వచ్చింది. దానిని త్వరలోనే సవరించేలా చర్యలు చేపడుతాం. రహదారిని పక్కనే ఉన్న మట్టి రోడ్డుకు సీసీ రహదారి సమాంతరంగా ఉండాలనే సూచనల మేరకు రోడ్డును అలా నిర్మించాల్సి వచ్చింది. దాన్ని సరిచేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తాం.

– నరేష్, ఏఈ, శంషాబాద్ మున్సిపాలిటీ

ప్రజాసమస్యలపై బీఆర్‌ఎస్ అవిశ్రాంత పోరు



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం

మణికొండ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పార్టీ అవిశ్రాంత పోరాటం చేస్తుందని ఆ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ల్యాంకోహిల్స్ పరిధిలోని ఏఎస్‌బీఎల్ లేక్ సైడ్ టవర్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రహదారులలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. సైన్ బోర్డులు పెట్టి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. పరిష్కార మార్గంలో ల్యాంకో హిల్స్ నుంచి సాయికృప వారు వేసిన లేఔట్ ప్రకారం హైటెన్షన్ వైర్ల కింద పద్మనాభ స్వామి ఆలయం వెళ్లడానికి అనువుగా ఏర్పాటు చేసిన పాత రహదారి మార్గ సూచికలు ఉన్నాయని ఫెన్సింగ్ వేసి రహదారి మూసివేశారన్నారు. ఫెన్సింగ్ తొలగించి ప్రజల సౌకర్యార్థం రహదారిని కొనసాగించాలన్నారు. మున్సిపాలిటీ వారు ఒక వైపు రిజిస్ట్రేషన్ అధికారులు, మరో వైపు ఒక ప్లాట్‌కు ఆస్తిపన్ను ఇద్దరికీ కట్టమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. రహదారి వీధి దీపాలు లేనందున నిర్మానుష్యంగా ఉన్న స్థలంలో రాత్రి కాగానే కొంత మంది మత్తు పానీయాలు సేవించిన తరువాత పెద్దగా అల్లర్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. అపార్ట్‌మెంట్ వెనుక ఉన్న ఖాజాగూడ సరస్సు కొద్ది కొద్దిగా కబ్జాకు గురవుతుందని దీనిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణ, శ్రీధర్‌నాయుడు, ప్రశాంత్, శ్రీధర్, జైరామ్, నరేష్, కోటిరెడ్డి, సురేష్, శ్రీకాంత్, శివ, రాణా, శ్రీనాథ్‌రెడ్డి, సిద్దేశ్వర్, రవీందర్, బాబు, రఘు ఉయ్యాల, రమణరెడ్డి, కృష్ణ, ఆశా, శాంతి, విశ్వజిత్, సచిన్‌లతో పాటు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంగం శ్రీకాంత్, కోడిచెర్ల దేవేందర్, యాలాల కిరణ్, భానుచందర్, జైరామ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, రమణమూర్తి, యాలాల బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్స్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భావనారుషి కాలనీ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను నిర్వహించనున్నారు. శిక్షణ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించగా విద్యార్థినీవిద్యార్థులు, హోమ్ మేకర్స్ కూడా ఉత్సాహంగా పాల్గొని తమ దరఖాస్తులను అందించారు. ఈ సందర్భంగా నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమార స్వామి మాట్లాడుతూ... కంప్యూటర్ కోర్సులు, టైపింగ్, రైటింగ్, సి లాంగ్వేజ్ లాంటి అంశాలు బోధించనున్నట్లు తెలిపారు. యువతకు ఉపయోగపడే ప్రాజెక్టులపై తమ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. క్లబ్ సాంస్కృతిక కార్యదర్శి గొంత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ... సాంకేతిక విజ్ఞానం ఈ రోజుల్లో ఎంతో అవసరం కావడంతో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సామల యాదయ్య, కొంకటి ఆంజనేయులు, చిరంజీవి, ఇప్ప రమేష్, విద్యార్థులు, హోమ్ మేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల తాకిడి!



రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు విద్యాశాఖ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్‌రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు విశాలమైన తరగతి గదులు, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... ఎలాంటి సదుపాయాలు లేకుండా ఇరుకు గదుల్లో డిగ్రీలు లేని శిక్షణ లేని ఉపాధ్యాయుల చేత విద్యార్థులను రుద్దడం మాత్రమే చేస్తారని అన్నారు. హంగు.. ఆర్భాటాలతో విద్యార్థులు.. విద్యార్థుల తల్లిదండ్రులను భ్రమలో పడేస్తూ పాఠశాల నుంచి అడ్మిషన్లు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మధ్య తరగతి కుటుంబాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు స్థానిక యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని ఎంఈఓ కోరారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంచి రికార్డులు ఉన్నాయని అన్నారు. దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిలు ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రెండు వేలకు పైచిలుకు ఉందని అంతేస్థాయిలో ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు సొంతమని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని ప్రతి విద్యార్థి ఎంతో ధైర్యంగా స్వేచ్ఛగా తన మనోభావాలను కుటుంబ నేపథ్యం తదితర అంశాలను వివిధ సభల్లో చెప్తారన్నారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు పాఠశాలల పేర్లలో ముందు వెనుక తోకలు తగిలిస్తూ విద్యార్థి లోకాన్ని ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోనే ఉన్న ఎలాంటి పర్మిషన్ లేకుండా నడిపిస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. విద్యా శాఖ అనుమతి లేకుండా ఎలా పాఠశాల బోర్డులను ఏర్పాటు చేసుకుంటారని అలాంటి వాటిని వెంటనే తొలగించాలని ఆయన సూచించారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



ఒగ్గు కళాకారుల నృత్యం

రాజేంద్రనగర్: వేద పండితులు, ఒగ్గు కళాకారుల మంత్రోచ్ఛరణల మధ్య హైదర్‌గూడ శ్రీ మల్లికార్జున స్వామి అష్టమ కల్యాణ మహోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ రకాల పూలు, పండ్లతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. శనివారం రాత్రి గణపతి పూజ, స్వామి వారి అభిషేకం, గంగ తెప్ప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా హాజరయ్యారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య గంగ తెప్ప, బోనాల ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. గౌరెల్లి నాగేశ్ అన్నదానం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు, భక్తులు బండారు నారాయణ, ఎగ్గే మల్లేశం, మొండ్రా నరసింహ, నారగూడెం మల్లా రెడ్డి, రామేశ్వర్ రావు, శేఖర్ రెడ్డి, కొమురయ్య, నల్లింగ్ రమేశ్, సాబదా విజయ్, సులిగే వెంకటేశ్‌తో పాటు మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, రాజేంద్రనగర్ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, మొండ్ర సంగీత, అర్చన, కల్యాణ మహోత్సవ కమిటీ ప్రతినిధులు క్యాదం నర్సింగ్‌రావు, కొంగళ్ల ప్రసాద్, నల్లింగ్ రాజు, మహేందర్, బీట్కూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు నిరుపేద కుటుంబాలకు మంజూరైన షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు ముందుగా మీ సేవా కేంద్రంలో సంప్రదించి అవసరమైన ధ్రువ పత్రాలను జత చేయాలన్నారు. షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు అమ్మాయికి చెందిన ఆధార్ కార్డు, వయస్సు ధ్రువపత్రాలతో పాటు బ్యాంకు ఖాతాను పొందుపరచాలన్నారు. సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్



సంతోష్‌నగర్ పార్కులో యోగా చేస్తున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గోల్కొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని సంతోష్‌నగర్ పార్కు మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు ఈశ్వర్‌జోషి తెలిపారు. ఆదివారం ఉదయం సంతోష్‌నగర్ పార్కులో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని అన్నారు. క్రమం తప్పకుండా యోగా చేసే వారు రోగాలకు దూరంగా ఉండగలుగుతారన్నారు.

షీ టాయిలెట్ల నిర్వహణ అధ్వానం



గోల్కొండ కోట ఎదురుగా ఉన్న షీ టాయిలెట్స్

గోల్కొండ: షీ టాయిలెట్స్‌ల నిర్వహణ బల్దియా వారు గాలికి వదిలేశారు. పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట వద్ద రెండేళ్ల క్రితం స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా ఓ స్వచ్ఛంద సంస్థ వారు మహిళల కోసం షీ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. అయితే నెల రోజుల పాటు షీ టాయిలెట్స్ నిర్వహణ సవ్యంగానే సాగింది. కోటకు వచ్చే మహిళా పర్యాటకులు టాయిలెట్ ఎంతో ఉపయోగకరంగా ఉండింది. అయితే ఘనత వహించిన బల్దియా వారు మాత్రం పూర్తిగా గాలికి వదిలేశారు. ప్రస్తుతం టాయిలెట్ డోర్ పనిచేయకపోవడంతో పాటు దీనికి నీటి సరఫరా కూడా జరగడం లేదు. టాయిలెట్ మూలనపడడంతో టాయిలెట్ వెనుక ఉన్న సందులో పురుషులు మూత్ర విసర్జన చేస్తున్నారు.

హైదర్‌గూడ అగాపే టెంపుల్ చర్చిలో...



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు



భక్తిశ్రద్ధలతో ఈస్టర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న ఈస్టర్ గుట్టపై ఆదివారం ఉదయం ఈస్టర్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరై క్రైస్తవులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

హైదర్‌గూడ చర్చిలో...

అత్తాపూర్: ఈస్టర్ వేడుకలు అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ఆదివారం ఘనంగా జరిగాయి. అగాపే టెంపుల్ హైదర్‌గూడ చర్చిలో పాస్టర్ సోమారం రాజ్‌కుమార్ ఏసు క్రీస్తు పునరుత్థానంపై భక్తులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నాటికలు, నృత్యాలు చర్చికి వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా కోట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని కోట మైసమ్మ దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలను ప్రారంభించారు. గణపతి పూజ, హోమం తదితర కార్యక్రమాలలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానంతో పాటు అమ్మవారికి నాలుగు లక్షల ఇరవై వేల రూపాయలతో అమ్మవారికి బంగారు ఆభరణాలు చేయించిన రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన లీలాకృష్ణ మోహన్ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

